




# అగ్రి ఎంప్లాయీస్ ఆత్మీయ సమ్మేళనం

## జిల్లా అధ్యక్షులు గుజ్జ అనిల్ ఆధ్వర్యంలో తరలివచ్చిన సభ్యులు

**వనం నాగయ్య, కెరటం న్యూస్**

అగ్రి ఎంప్లాయీస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుజ్జ అనిల్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనానికి జిల్లాలోని పలు ప్రాంతాలనుండి తరలివచ్చారు. మారెమ్మ తల్లి టెంపుల్ దగ్గర ఏర్పాటుచేసుకున్న అసోసియేషన్ ఆత్మీయ సమావేశానికి అధ్యక్షులు గుజ్జ అనిల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రి ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు తమ విధుల్లో భాగంగా ప్రమాదాలకు గురైనప్పుడు, విధి వంచితులై అకాల మరణానికి గురైనప్పుడు వారి కుటుంబాలు రోడ్డున పడకూడదన్న పవిత్రమైన ఆశయంతో వారి కుటుంబాలకు అండగా ఉండేందుకే అగ్రి ఎంప్లాయీస్ అసోసియేషన్ సంస్థను స్థాపించామన్నారు. మనతో కలిసి పనిచేసి ప్రమాదాలకు గురై చనిపోయిన, వికలాంగులుగా మారి కుటుంబాలను పోషించుకోలేని వారికి మన సంస్థ పెద్దదిక్కుగా నిలిచిందన్నారు.

### చేయి చేయి కలుపుదాం...అండగా నిలుద్దాం..

అగ్రి ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు ఒక కుటుంబాలా ఉండి అందరి సహకారంతో మన కుటుంబాలకు అండగా నిలుద్దామని జిల్లా అధ్యక్షులు గుజ్జ అనిల్ అన్నారు. ఇప్పటికే అసోసియేషన్ కొందరు ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలకు ఆర్దిక భరోసా కల్పించిందన్నారు. ముఖ్యంగా రెండు రోజుల కిందట కామెపల్లి మండలంలోని ఫీల్డ్ అస్టెంటు బానోత్ నరేష్ కుటుంబానికి విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్ల అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లఖండం నాగేందర్‌రావు, రామడుగు మనోహర్‌రావు చేతుల మీదుగా రూ. 3. 50లక్షలు అందించి మృతుడు నరేష్ కుటుంబ కష్టాల్లో పాలుపంచుకున్నామని అన్నారు. దీంతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ ఇస్లావత్ వేణు అనే వ్యక్తి విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురైనప్పుడు కాలును పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో వేణు కుటుంబం కష్టాల్లో చిక్కుకున్నప్పుడు అసోషియేషన్ ముందుకు వచ్చి వేణుకు ప్లాస్టిక్ కాలు పెట్టించేందుకు ఏకంగా రూ. 2. 20లక్షల ఆర్దిక సాయం అందించామన్నారు. బేయర్ కంపెనీలో పుసులూరి నాగేశ్వరరావు అనే మరో చిరుద్యోగి హార్ట్ ఎటాక్‌తో చనిపోయి ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిన సందర్భంలో అసోసియేషన్ ఆ కుటుంబానికి రూ. 40వేలు ఆర్దిక సాయం అందించి భరోసానిచ్చింది. వరంగల్‌కు చెందిన మరో ఫీల్డ్ అసిస్టెంట్ చనిపోయిన తీరని దు:ఖంలో ఉన్న ఆయన కుటుంబానికి రూ. 1లక్ష అందించామన్నారు. మరో ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి రూ. 65వేలు అందించామని తెలిపారు. రాబోవు రోజుల్లోనూ చేయిచేయి కలిపి సమిష్టిగా బాధితులకు అండగా నిలుద్దామని అన్నారు.

### ప్రశంసా పత్రాలు సన్మానాలు....

ఆదివారం ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన అసోసియేషన్ సభ్యులు అంతా విందు చేసుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు గుజ్జ అనిల్‌ను, జిల్లా కమిటీ సభ్యులను శాలువాలు, పుష్పగుచ్చాలతో సన్మానించారు. అనంతరం సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుజ్జ అనిల్ మరియు కార్యనిర్వాహక సభ్యులు, అక్కినేని హరికృష్ణ, కార్యదర్శి పోటు శ్రీధర్, నీరుమల్ల ఉపేందర్, ధరావత్ సుధాకర్, డివిఎస్ శర్మ, వివిధ మండలాలకు చెందిన సభ్యులు హాజరయ్యారు.







